ప్రఖ్యాతుని భార్య

నా భర్త కవి! రచయిత. మంచి ప్రఖ్యాతి గడించిన వారిలో వొకరు. అందులో ముఖ్యంగా స్త్రీల కష్టసుఖాలను బాగా అర్థంచేసుకొని, వాటి నివారణకై కృషిచేస్తున్న రచయితగా ఆయనకు మంచి పేరువుంది. ఆయన రచనలంటే పురుషులకన్న స్త్రీలకే ఎక్కువ మక్కువ.

ఇటువంటి వ్యక్తి భార్యనైనందుకు నన్నుచూచి చాలామంది అసూయ పడటంకూడా నేను ఎరుగుదును. వాళ్ళకేం తెలుసు, నాబోటివాళ్ళ అగచాట్లు? ఈ మధ్య వారికి పెద్ద సన్మానం జరపాలని ప్రయత్నాలు జరిగినై. వారి రచనలను గురించి, వారి ప్రతిభను గురించి వొక "సావనీర్" వెయ్యాలనికూడా వారి అభిమానులు సంకల్పించారు.

ఈ సందర్భంలో చాలామంది స్త్రీలు మా యింటికి వొస్తుండేవారు. వారి అలవాట్లను గురించి, అభిమానాలను గురించీ నన్ను రకరకాలుగా అడుగుతుండేవారు.

అందులో ఒకమ్మాయి "వారి భార్య అయినందుకు మీకు ఎలావుందో చెప్పండి" అని అడిగింది.

"అసహ్యంగావుంది. ఆముదం తాగినట్లుగావుంది" అని చెబుదామని నోటిదాకా వచ్చింది. మెదలకుండా వూరుకున్నాను. ఊరుకున్నాను అంతే వారాయన్ని గురించి అంత గొప్పగా అనుకుంటూవుంటే నేను ఏమి చెప్పి ఏం ప్రయోజనం? అప్పటికే ఆయన అభిమానులు చాలామంది నేను ఆయనకు తగ్గ భార్యను కాదని చెప్పుకోవటం నేను ఎరుగుదును. అలా చెప్పుకోటానికి ఆయనకూడా కొంత కారణం.

స్త్రీలలో కొంతమందికి ఆయనంటే అభిమానం అని చెప్పానుగదూ. ఆయనకు స్త్రీలతో స్నేహం చేయటం సరదా! తను వ్రాసినవి వారికి చదివి

వినిపించి, వారిచేత చదివించుకొని విని సంతోషిస్తూ వుండేవారు మొదట్లో తాము వ్రాసినవి నన్ను చదివి వినిపించమనేవారు. వినిపించేదాన్ని. కాని నాకు చాలా విసుగ్గా వుండేది.

“నువ్వు మనస్సు పెట్టి చదవటంలేదు” అనేవారు.

“ఇంకెలా?” అని అడిగేదాన్ని.

“ఆ రచనలోవున్న అందం నీవు గ్రహించినట్టు లేవు” అనేవారు; అని అందులోవున్న అందాన్ని వ్యాఖ్యానించి, వ్యాఖ్యానించి చెపుతుండే వారు.

“అర్థం అయిందా?” అని అడిగేవారు.

ఎందుకు వచ్చిన గొడవ-“అయింది” అనేదాన్ని.

“ఏమయింది-చెప్పచూతాం” అనేవారు

ఏమి అన్యాయం ఇది? నా కసలే ఆ రచన బాగుండేది కాదు. పైగా చదువుతున్నంతసేపూ బాధగా వుండేది. బాధ ఎందుకంటారా? ప్రతి రచనలోనూ ఆయన వొక స్త్రీని ఆరాధించటం, పువ్వులతో పూజించటం, ఆ స్త్రీకూడా తనపట్ల ప్రేమను చూపించటం, చివరికి ఎడబాటు కలగటం, ఆమె గడపలో నిలబడి రెండు కన్నీటిబొట్లు రాల్చటం, తాను గడప మెట్లక్రింద నిలబడి, మరి రెండు కన్నీటిబొట్లు రాల్చటం జరుగుతూ వుండేది. తరువాత ఆమె నేత్రాల వర్ణనా, జడలో తురిమిన పువ్వులవర్ణనా, శరీరం వొంపుల వర్ణనా వుంటూ వుండేవి. ఇక నేను బాధపడకుండా ఎట్లా వుండేటట్లు? నేను ఆయన భార్యను, కష్టసుఖాలలో భాగస్వామిని. ఆయన సుఖంకోరి, రాత్రింబగళ్ళు కష్టపడుతున్నాను. నేనూ చదువుకున్న దాన్నే; రావాలంటే ఉద్యోగంలోజేరి హాయిగా, కాలం గడపగలిగినదాన్ని. ఆయన కోసం అన్నీ మానుకొని, ఇంటిని అంటిపెట్టుకొని వున్నదాన్ని. ఆయనకు యెక్కడ యేలోటు వస్తుందో అని వెయ్యి కన్నులతో కనిపెడుతూ, అన్ని పనులు నేనేచేసి పెట్టేదాన్ని. ఇటువంటి నాకు, ఆయన మరొక స్త్రీని గురించి అలా తపనపడుతున్నట్లు వ్రాస్తుంటే బాధగావుండక ఏమవుతుంది?

ఒకరోజు అడిగాను—"ఎవ్వరా స్త్రీ?" అని.

ఆయన ఒక్కక్షణం ఆశ్చర్యంగా చూచి, "నువ్వే అనుకోరాదూ?" అన్నారు.

నేనే అనుకోవాలంట! నేను కాదని నాకు తెలుసాయె! ఇక నేను అని అనుకోవటం ఎలా? నేనే అయితే ఈ విరహం దేనికి? ఈ కన్నీటి బొట్లు దేనికి? ఎప్పుడూ ఇంట్లోనే ఆయనను కనిపెట్టుకొని వుంటూనే వుంటినిగదా!

"ఎందుకండీ ఈ అబద్ధాలు?" అన్నాను.

ఈ మాటకు ఆయన నన్ను రెండుక్షణాలు తదేకధ్యానంతో చూశారు. ఏమీ అనలేదు. అక్కడనుంచి నెమ్మదిగా వెళ్ళిపోయారు. రెండురోజులు నాతో ఎక్కువ మాట్లాడలేదు. ఏదో ఆలోచిస్తూ వున్నట్లు వున్నారు. నాతో అబద్ధం చెప్పినందుకు నొచ్చుకుంటున్నారనీ, ఇక నాతో ఎటువంటి అబద్ధాలు చెప్పరనీ సంతోషించాను. మూడోరోజు ఆయనంత ఆయనే నన్ను మాట్లాడించి, "నీతో నిజం చెప్పటానికి వొచ్చాను" అన్నారు.

ఒక్కసారిగా నా మనస్సు సంతోషంతో నిండిపోయింది. ఏ విషయమో తెలుసుండికూడా, ఆయనచే చెప్పించుకొని వినాలని, "ఏ విషయమండీ?" అని అడిగాను.

"మొన్న నీవు అడిగిన విషయం!"

"పోనిద్దురూ, ఇప్పుడెందుకు ఆ గొడవ" అన్నాను. నిజంగా ఒకరు చేసినపనికి పశ్చాత్తాప పడుతుంటే వినటం కష్టంగా వుంటుంది. అందులో దగ్గరివాళ్ళ పశ్చాత్తాపం వినటం మరీ కష్టం. అందుకని అలా అన్నాను.

"కాదు. నువ్వు వినాలి" అన్నారు.

"అయితే చెప్పండి"

"ఎవ్వరో ఒక స్త్రీని మనస్సులో పెట్టుకొని నేను రచనలు చేస్తున్నానని నీవు అనుకోవటం అన్యాయం...." అని మొదలు పెట్టారు.

నాకు మళ్ళీ కోపం వచ్చింది. "మరి నన్ను గురించి వ్రాస్తున్నాను అంటిరిగా!" అన్నాను.

"అందులో అబద్ధంలేదు. నిన్నుగురించి వ్రాస్తున్నాను. ఇంకా అనేకమంది స్త్రీలనుగురించి వ్రాస్తున్నాను. స్త్రీలలో వున్న అందాలనూ, సౌకుమార్యాన్ని, వెలుగులనూ, వొకరాశిగాపోసి, ఒక దివ్యమంగళ విగ్రహాన్ని సృష్టించుకొని ఆ విగ్రహాన్ని ఆరాధిస్తున్నాను...." అన్నారు.

"కాబట్టి మీ ఆరాధనలో నేను లేనట్లేగా?"

"ఇతరులు వున్నంతవరకూ నీవూ వున్నావు."

"మీకు అనేకమంది స్నేహితురాండ్రు వున్నారు గదా, వాళ్ళలో ఈ విషయం చెప్పారా?"

"మీరు ఆరాధించేది ఎవ్వరిని–అని వారెప్పుడూ నన్ను అడగ లేదు...."

"వారు అడిగి వుండరు. నిజమే, ఎందుకంటే వారిలోని ప్రతి వొక్కరికీ, ఆ దివ్యమంగళ విగ్రహం నీవే అనే భ్రాంతిని మీరు కలిగిస్తు న్నారు. ఎవ్వరికివారు మీరు వ్రాస్తున్నది తమని గురించే అని ఉబ్బి తబ్బిబ్బు అవుతున్నారు." అన్నాను.

వారింకేదో చెప్పబోయారు. నేను వినలేదు. ఆ రోజునుంచీ మా ఇద్దరిమధ్యా నిజంగానే పెద్ద అగడ్త ఏర్పడింది. అప్పటినుంచీ ఆయన తన స్నేహితురాండ్రతో నన్ను గురించి చెప్పటం ప్రారంభించారు. చెప్పటం అంటే నేనేదో దోషం చేసినట్లుగా కాదు. స్త్రీలపట్ల అత్యంత సానుభూతి వున్న ఆయన, స్త్రీని ఆరాధ్యదైవంగా కొలిచే ఆయన నన్ను గురించి మాత్రం పెద్ద దోషంగా యెలా చెప్పగలుగుతారు? 'ఆమె అంటే నాకు అపరిమితమైన యిష్టం. కాని ఆమె నన్ను అర్థంచేసుకోలేదు' అని మాత్రమే చెప్పేవారు; చెప్పి రెండు కన్నీటిబొట్లు రాల్చేవారు.

వారి అభిమానులకు నన్ను గురించి ఊహించటానికి అంతవరకు చాలు. నన్ను గురించి యెన్నో ఊహించటమేకాక అందరికీ చెప్పేవారు. చివరికి వారు మా యింటికి రావటం మానివేశారు. నేను ఎక్కడన్నా కనుపించినా నన్ను పలకరించేవారుకాదు. నన్నుచూచి వారిలోనేవారు గుసగుసలాడుకునేవారు. నాకు చాలా కష్టంవేసేది. నా భర్త వాళ్ళ స్నేహితుడా? నేను వాళ్ళకి విరోధినా? ఎందుకు?

"ఇదేమీ బాగాలేదు" అన్నాను నా భర్తతో.

"ఏది?"

చెప్పాను. చెప్పి, "నేనంటే వాళ్ళకి గిట్టనప్పుడు మీరు వాళ్ళతో ఎందుకుస్నేహం చెయ్యాలి?" అని అడిగాను.

"స్నేహంచేస్తే తప్పేముంది?"

"నేను మీకు సరిపడని మగవాళ్ళతో స్నేహంచేస్తే మీ కెట్లా వుంటుంది చెప్పండి?" అన్నాను.

"ఎవ్వరికి వుండే స్నేహితులు వారికి వుంటారు. అందులో తప్పేమివుంది" అన్నారు. "నీ ఇష్టంవచ్చినవారితో నువ్వు స్నేహంగా వుండు. నిన్నేమన్నా అడిగితే అప్పుడు అడుగు" అన్నారు.

ఆయన మాటల ధోరణిబట్టి చూస్తే ఆయనకు నేను ఇతరులతో స్నేహాలు చెయ్యాలనే ఆతురత వున్నట్లు నాకు అనిపించింది. వారికిమల్లే నేను స్నేహాలుచేస్తే ఇంట్లో సణుగుడు ఉండదని ఆయన భావించినట్లున్నారు. అప్పటికి తన స్వార్థమే. అప్పటినుంచీ నాకు ఆయనమీన వున్న గౌరవం కాస్తపోయింది.

ఇక ఆయన్ని గురించి యెక్కువ పట్టించుకోగూడదు—అనుకున్నాను. ఏదో ఒకపని కల్పించుకొని అందులో నిమగ్నురాలనయి వుండేదాన్ని. ఆయనకూడా నా సంగతి పట్టించుకోకుండా తిరుగుతుండేవాడు. కాని ఎంత ప్రయత్నించినా నా జీవితాన్ని గురించి నేను ఆలోచించకుండా వుండ

లేక పోయేదాన్ని. వివాహానికి పూర్వంరోజులు జ్ఞాపకం వస్తూ వుండేవి. అంతకుముందు వారి పుస్తకాలు కొన్ని నేను చదివాను. ప్రతి పుస్తకంలో వారేదో బాధపడుతున్నట్లు కనుపించేది. గనక అందని దేనికోసమో ఆరాట పడుతున్నట్టూ, అన్వేషిస్తున్నట్టూ కనుపించేది. ఆ పుస్తకాలు చదువుతుంటే వారిని నాకెంతో జాలికలిగేది. వారి బాధను నేను నివారింపగలను అనిపించేది. ఏదో మాటామాట మీద, ఆయన రచనా వైదగ్ధ్యాన్ని గురించి ఒక సమయంలో నా స్నేహితురాండ్రతో ప్రస్తావించాను. ఈ సంగతి వారి చెవులకు ఎట్లా జేరిందో జేరింది.

ఆ రోజునుంచీ వారు మా యింటికి వస్తుండేవారు. తెల్లవారి, ఇన్ని యెర్రకలువలు పట్టుకొనివచ్చి నా కిచ్చిపోతుండేవారు. ఎక్కువ మాట్లాడే వారుకాదు.

"మీకోసం తెచ్చాను" అనేవారు. "దోసిలిపట్టండి" అని చెప్పి దోసిలినిండా పోసి పోయేవారు.

"ఎందుకే అట్లా పువ్వులు తెచ్చిపోసి పోతుంటాడు" అని అడిగేది మా అక్క.

"ఏమోలేవే, ఆయనది పిచ్చి ఆనందం" అనే దాన్ని.

కాని మా వాళ్ళెవ్వరికీ ఆయన రాకపోకలు ఇష్టంగా వుండేవికావు. ఆ సంగతి ఆయనకు తెలుసు. అయినా రాకుండా వూరుకునేవారు కాదు. వచ్చి, ఆయన యింతకు ముందు ప్రేమించిన యువతులను గురించీ, వారి కోసం తాను చేసిన త్యాగాలనుగురించీ చెప్పి, చివరికి వారు తన ఆశలనన్నీ ఏ విధంగా అడియాసలను చేసిందీ చెప్తుతుండేవారు. ఆ సంగతులన్నీ చూస్తే నాకు చాలా జాలివేసేది. నన్ను గొప్పచేసి తన కష్టసుఖాలను చెప్పుకుంటూ వుంటే, ఆ రోజుల్లో నాకు బాగానే వుండేది. ఆ వయస్సు అటువంటిది అనుకుంటాను.

చివరికి ఆయన తనను వివాహం చేసుకోమని అడిగారు. మా వాళ్ళకి ఎవ్వరికి ఇష్టంలేకపోయినా నేను అంగీకరించాను.

"ఏం సుఖపడదామనే?" అని అడిగింది అక్క.

నే నేమీ సమాధానం చెప్పలేదు. చెప్పినా వాళ్ళకి అర్థంకాదని ఆ రోజుల్లో నేను అభిప్రాయపడుతూ వుండేదాన్ని.

మా వివాహం జరిగింది.

ఇవన్నీ జ్ఞాపకంవచ్చి, ఆ నాటికి ఈ నాటికి వున్న తేడా స్ఫురణకు వచ్చి, కళ్ళవెంట నీళ్ళు జలజలా రాలినై. జీవితం అంధకార బంధురంగా కనుపించింది. నాకడుపున ఒక కాయకాచినా బాగుండేది అనిపించింది. ఆ ప్రాప్తంకూడా లేదు. ఇక యిప్పుడు చేసేది యేముంది? రోజులు జరగనీ, ఎన్నాళ్ళు జరుగుతవో అనుకొని వూరుకున్నాను.

ఒకరోజు నేను, నా చేతి మిషన్‌మీద పొరుగింటి బీద పిల్ల లంగా కుట్టిపెట్టమని అడిగితే కుట్టిపెడుతున్నాను. వారు హడావిడిగానే, పేరుపెట్టి పిలుస్తూ నా గదిలోకి వచ్చారు. నాకు ఆశ్చర్యం వేసింది. ఈ మధ్య వారు నన్ను పేరుపెట్టి పిలిచి ఎరుగరు. అందులో ఆ కంఠధ్వని అతి విచార కరంగా వుంది. తల పైకెత్తి చూశాడు. ఏమిటది? ఆయన జుట్టు రేగివుంది. చొక్కా చేతిమీద చిరిగివుంది. పై జమా మట్టికొట్టుకొనివుంది. క్షణంలో పదేళ్ళ వయస్సు పెరిగినట్లు కనుపించారు.

"నువ్వు నాకొక సహాయం చెయ్యాలి" అన్నారు.

"ఏమిటండీ!"

"నువ్వు రామచంద్రరావుగారిని ఎరుగుదువా.." అని ప్రారంభించారు.

"ఎవరు? ఈ మధ్యనే సబ్ ఇన్‌స్పెక్టరుగా వచ్చారు"

"అవును. నేను యివ్వాళ, అంటే యింతకుముందే వారింటికి వెళ్ళాను...."

"ఎందుకు వెళ్ళారు!"

"చూద్దామని వెళ్ళాను"

"ఎవ్వరిని?"

"వారినే...."

"కాదు. వారి అమ్మాయిని చూద్దామని వెళ్ళివుంటారు...."అన్నాను. వారి అమ్మాయిని కొద్దిరోజులకు పూర్వమే నేను వొక మీటింగులో చూశాను.

ఈ మాటలకు "నువ్వుకూడా నన్ను అపార్థం చేసుకుంటే ఎలా చెప్పు" అని కన్నీరు పెట్టుకున్నారు వారు.

"పోనీలెండి. ఎందుకు వెళితేనేం, వెళ్ళారు.ఏంజరిగిందో చెప్పండి" అన్నాను.

"నేను వెళ్ళేటప్పటికి రామచంద్రరావుగారు వాకిట్లోనే వెళ్ళటానికి వీల్లేదని బయటకు నెట్టివేశారు...." అన్నాడు.

రేగిన జుట్టూ, చినిగిన చొక్కా, మట్టికొట్టుకున్న పైజమా చూచి, వారు చెప్పిందానికంటే పెద్ద గ్రంథమే జరిగి ఉంటుందని నేను ఊహించాను.

"చూట్టానికి వొచ్చినవారిని నెట్టివెయ్యటం యేమిటండీ?" అన్నాను.

వారు వొక్క నిట్టూర్పు విడిచి, "నువ్వనుకున్నట్లే ఆయనా తన కూతుర్ని చూట్టానికి వొచ్చాననుకున్నాడు...."

ఇక మిగిలిన సంగతి ఊహించటం యేమంత కష్టంకాదు. వారు కొద్దిరోజులనుంచి పువ్వులు పట్టుకొని వారింటికి వెళుతూవుండి ఉండాలి. వారి అమ్మాయితో కబుర్లు పెట్టుకొని ఉండాలి. అది వారికి యిష్టంవుండి ఉండదు. ఇంకేం? జరగవలసింది కాస్తా జరిగివుంటుంది.

నాకు చీదరవేసి "ఇప్పుడు యేం చెయ్యమంటారు నన్ను!" అడిగాను.

"నువ్వు వాళ్ళ యింటికి వొకసారి వెళ్ళిరావాలి?"

"దేనికి!"

"ఆ సబ్ ఇన్‌స్పెక్టరు తన కూతుర్ని హింసిస్తూ వుంటాడు-అతను నన్నేం చేసినా నేను సహించగలను కాని, ఆ అమ్మాయిని నా మూలంగా కష్టపెట్టడం సహించలేను...."

"అంతవరదాకా యెందుకు వస్తుందండీ? మీరు ఆ అమ్మాయిని చూడనేలేదు అంటిరిగదా!"

"చూశాను. వొకటి రెండుసార్లు చూశాను."

నేనిక తరచదలచలేదు. అమాయకత్వంవల్ల నిజంగానే ఆ అమ్మాయి చిక్కుల్లో బాధల్లో పడ్డదేమో అని అనిపించింది. చేతనైతేవారు చేసిన తప్పులను సరిదిద్దాలనిపించింది.

"సరే,నేను వెళ్ళివస్తాను. వీలైతే రామచంద్రరావుగారు మీ జోలికి రాకుండా చేస్తాను. అయితే మీరు నాకొక వాగ్దానం చెయ్యాలి." అన్నాను.

"నువ్వు ఏం చెయ్యమంటే అది చేస్తాను."

"ఇక యిటువంటి పనులు చెయ్యనని వాగ్దానం చెయ్యండి."

"అలాగే" అని వాగ్దానం చేశారు.

నేనారోజు సాయంకాలం ఏదో పనిమీద వెళ్ళినట్లు రామచంద్ర రావుగారి యింటికి వెళ్ళాను. రామచంద్రరావుగారు ఇంకా ఆఫీసునుంచి రాలేదు. వారి అమ్మాయి ముందు గదిలో కూర్చొని ఏదో చదువుకుంటూ వుంది.

ఆ అమ్మాయికి పదిహేను పదహారు ఏళ్ళువుంటాయి. జీవితంలోని కృత్రిమం, మోసం ఏమాత్రం దగ్గరకు రానిచ్చిన అమ్మాయికాదు. అమాయకురాలు.

నన్నుచూచి ఆ అమ్మాయి మొదట్లో ఆశ్చర్యపడింది. నేను అవీ ఇవీ మాట్లాడి ఆ అమ్మాయి పసిగట్టకుండానే అసలు విషయంలోకి దింపాను. ఆ అమ్మాయి వున్నసంగతి వున్నట్టు చెప్పి వేసింది. ఏమీ

కృత్రిమంలేదు. దాచుకోటానికి ప్రయత్నించలేదు. అతి సహజంగా చెప్పి వేసింది.

నేను వూహించింది నిజమే. మావారు వారంరోజులనుంచి వారి యింటికి వెళ్ళివస్తున్నారట. మొదట్లో ఆ అమ్మాయితో యేవేవో సాహిత్యం గొడవలు మాట్లాడేవారట. తరువాత తాను రాసినవి వినిపించేవారట. తరువాత తాను వ్రాసినవి చదివించుకునేవారట. మొదటినుంచి వాళ్ళ నాన్నకి ఆయన యింటికి రావటం ఇష్టంగా ఉండేది కాదట. రెండు మూడ్రోజులు గడిచిన తర్వాత తనకికూడా కష్టంగా ఉండేదట.

ఒకరోజు, "మీరు రావటం మా వాళ్ళకు యిష్టం లేదండీ" అని చెప్పిందట.

"మీ వాళ్ళసంగతి నాకెందుకు? నీ సంగతి చెప్పు!" అన్నారుట.

"నా సంగేతేముందండీ? మా వాళ్ళ ఇష్టాయిష్టాలను బట్టిపోయే దాన్నే నేను" అన్నదట.

"అది తప్పు. ఎవ్వరి ఇష్టప్రకారం వాళ్ళం పోవటం ధర్మం. భగవంతుడు మెచ్చుతాడు. నీవు రావొద్దంటే ఈ క్షణంనుంచి రాను. లేకపోతే నన్నెవ్వరూ ఆపలేరు" అన్నారట మా వారు.

"నాకు కూడా మీరిలా రాకుండా ఉండడమే మంచిదని అనిపిస్తూ ఉందండీ" అన్నదట ఆ అమ్మాయి

"ఇది నీ ఉద్దేశ్యంకాదు. నువ్వు మీ వాళ్ళకుభయపడి ఇలా అంటు న్నావు. నీ ఉద్దేశ్యం నాకు తెలుసు" అన్నారుట మావారు.

ఇంతవరకూ చెప్పి, "నేను అంత స్పష్టంగా చెపితే, అలా అంటా రేమిటి అక్కా? ఇంకా అంతకంటే యేం చెప్పను?" అని అడిగింది. "ఇక నాకేమీ తోచక నాన్నగారికి చెప్పివేశాను" అన్నది.

ఆ అమ్మాయి మాటలకూ అమాయకత్వానికీ ఆ పరిస్థితుల్లోకూడా

నాకు నవ్వు వొచ్చింది. వివాహానికి ముందు ఈ అమ్మాయికి వున్న ధైర్యం నాకు లేకపోయెనే—అని అనిపించింది. అప్రయత్నంగా కళ్ళు చెమ్మగిల్లినై.

"ఇక వారు మీ యింటికి రారులే అమ్మాయ్. మీ నాన్నగారితో కూడా నేను చెప్పానని చెప్పు?" అని చెప్పి, కాసేపు యేదో లోకాభి రామాయణం మాట్లాడి యింటికి బయలుదేరాను.

ఇంటిదగ్గర మావారు నాకోసం ఎదురుచూస్తూ కూచున్నారు. నన్ను చూడగానే ఎదురుగావచ్చి, "ఏమయింది?" అని అడిగారు.

"వాళ్ళజోలికి మీరు వెళ్ళకుండావుంటే, మీ జోలికి వాళ్ళు రారు" అన్నాను.

"ఆ అమ్మాయి ఎలావుంది?"

"సలక్షణంగా వుంది"

"ఏమన్నది?"

"తన జోలికి రావద్దన్నది"

"నువ్వు పొరపాటు పడుతున్నావు. అది ఆమె అభిప్రాయం కాదు. ఆమె తండ్రి వున్నాడే—సబ్ఇన్‌స్పెక్టరు, అతనికి భయపడి అలా అన్నది. ఆమెకు నేనంటే...." అని ప్రారంభించారు.

అంతలో నా ముఖంలో వచ్చిన మార్పును గమనించి నట్లున్నారు ఆపేశారు. నాకు సంభాషణ పెంచటం ఇష్టంలేక "మీ వాగ్దానం మరచి పోకండి" అని చెప్పి యింట్లోకి వెళ్ళాను.

కాని యేం లాభం? వారు వారి పద్ధతులను మరచిపోలేదు; సబ్ ఇన్‌స్పెక్టరుకి భయపడి, ఆ అమ్మాయి దగ్గరకు వెళ్ళటం అయితే మాని వేశారుగాని, ఇతరపోకడలు మానలేదు.

ఒకరోజు వారు చేసిన వాగ్దానం జ్ఞాపకం చేశాను.

"ఇందులో తప్పేమివుంది? మొగాళ్ళలో, ఆడవాళ్ళల్లో స్నేహితులు వున్నట్లుగానే, మొగా ఆడవాళ్ళకు స్నేహం ఎందుకు వుండ

గూడదు? ఒక స్త్రీకీ వొకపురుషుడికీ, ఒకరంటే ఒకరికి ఇష్టంవుండవచ్చు. వారు స్నేహితులుగా వుంటారు. ఇందులో తప్పేమివుంది? ఆ మాటకివస్తే ఆంధ్రదేశంలో ఇటువంటి ఉద్యమం వకటి లేవనెత్తాలని ఆలోచిస్తున్నాను" అన్నారు.

"అప్పుడుగాని ఆంధ్రదేశంలో వున్న మకిలి ప్రక్షాళన కాదు" అని ముగించారు.

నాకు వళ్ళు మండింది. "ఈ సిద్ధాంతం మీ వరకు బాగానేవుంది. తిని నలుగురి ఆడవాళ్ళతో తిరగవచ్చు. కాని ఆ ఆడపిల్లల గతేంకావాలి" అని అడిగాను.

"వాళ్ళకేం?" అన్నారు.

"వాళ్ళల్లో పెళ్ళి అయిన పిల్లలు వుండవచ్చు; కాని పిల్లలు వుండవచ్చు. ఏ నెపంతో మీతో తిరిగినా, పెళ్ళి అయిన పిల్లల భర్తలు ఊరుకుంటారా? పెళ్ళికాని పిల్లలకు పెళ్ళిళ్ళు అవుతాయా?" అని అడిగాను.

"ఇటువంటి స్నేహాలు నిష్కల్మష బుద్ధితో చూసే స్థితికి సంఘం రావాలి. అందుకే నేను కృషి చెయ్యదలిచాను" అన్నారు.

"సంఘం ఆ స్థితికి వస్తుందో రాదో మీకూ తెలుసు నాకూ తెలుసు. సంఘం ఆ స్థితికి రావాలని మీరు ఎందుకు కోరుతున్నారోకూడా మీకూ తెలుసు, నాకూ తెలుసు. ఒకవేళ కారణాంతరాలచేత యెప్పటికైనా సంఘం ఆ స్థితికి రానున్నా ఈలోగా యెంతమంది అమాయకపు పిల్లల జీవితాలు బజారు కెక్కవలసివస్తాయో ఆలోచించారా? ఎన్ని కుటుంబాల్లో చిచ్చు రేగుతుందో ఊహించారా?"

దీనికి సమాధానంగా వారు, ఒక పెద్ద పోజుపెట్టి, "ఒక ఘనకార్యం సాధించ దలచినప్పుడు కొంతమంది ఆత్మార్పణం చేసుకోవలసి వుంటుంది మరి" అన్నారు.

విన్నారా? ఇదొక సిద్ధాంతమట. దీనివల్ల సంఘంలో వున్న మలినం

శోషణం కాబోతున్నదట. ఇందుకు అమాయకపు పిల్లలు కొంతమంది ఆత్మార్పణం చేసుకోవాలట! నలుగురు ఆడవాళ్ళతో, కలిసి తిరగటానికి ఎంతచక్కని మాటలు? ఆయన సంగతి పూర్తిగా తెలిసిన నాకే ఒక్కొక్కప్పుడు పాపం, ఇవన్నీ నమ్మి చేస్తున్నారు కాబోలు–అని అనిపిస్తూ వుండేది. లోకాన్ని వంచనచేస్తున్నారో, తన్నుతాను వంచన చేసుకుంటున్నారో తెలిసేదికాదు. నా సంగతి ఇలా వుంటే, అథం శుభం తెలియని అమాయకపు పిల్లలసంగతి వేరే చెప్పాలా?

ఆయనకి ఏం చెప్పి ఏం ప్రయోజనం! ఏ విషయమైనా వింటారు గాని, ఈ విషయం దేవుడు చెప్పినా వినరు. ఈ విషయంలో ఎటువంటి స్నేహితులైనా, ఎంత డబ్బయినా ఒదులు కోటానికి సిద్ధమే. 'షైగ' ఒకటీ నిజం చెప్పరు. ఆయన ఒకప్పుడు చెప్పారు–"స్త్రీ శరీరం వంపులుచూస్తే ఇక తరువాత ఏం చేస్తానో నాకే తేలియదు" అని.ఆయన చెప్పిన ఏకొద్ది నిజాలలోనో ఇదొకటి. అదొకజబ్బేమో అనిపిస్తుంది నాకు అప్పుడప్పుడూ.

అలా గడిచిపోయినై రోజులు. ఎప్పటికైనా వారికి జ్ఞానం కలుగక పోతుందా – అనే ఆశ ఈనాటికి నన్ను ఒదలకుండా వుంది. అటువంటి సమయంలో ఈ సన్మానం ఒకటి వచ్చిపడింది. తన పనులను ఆంధ్రదేశం అంగీకరించి, ఆమోదించింది అనే భావంతో ఈ సన్మానం సంగతి తెలిసినప్పటినుంచీ ఆయన ప్రవర్తించటం మొదలు పెట్టారు—యిక విముక్తిలేదు.

ఇంకా సన్మానం నాలుగైదు రోజులుందనగా వారు నా దగ్గరకు వచ్చి, "సన్మానంనాడు నువ్వుకూడా మీటింగుకు రావాలి" అన్నారు.

"నేను రాను" అన్నాను.

"నువ్వు రాకపోతే ఎట్లా? లోకులు ఏమనుకుంటారు" అన్నారు.

చూశారా? నేను రావాలనికాదు, నేను వచ్చి ఆయనకు జరుగుతున్న గౌరవంలో పాల్గొనాలనీకాదు. నేను రాకపోతే లోకులు ఏమనుకుంటారో అని భయం.

"లోకులు అనుకునేది ఏముందిలెండి!" అన్నాను.

"లోకాన్నంతా సర్దగలుగుతాడుగాని ఇంట్లో వాళ్ళని సర్దుకోలేక పోతున్నాడు-అనుకోరూ? లోకాన్నంతా మార్చగలుగుతున్నాడుగాని ఇంట్లో వాళ్ళని మార్చలేక పోతున్నాడు అనుకోరూ? నువ్వు తప్పకుండా రావాలి" అన్నారు.

నేను సన్మానానికి వెళ్ళలేదు. పైగా అక్కడేవుంటే ఎవ్వరు వచ్చి బలవంతం పెడతారో అని ఆనాడు సాయంకాలమే మా కన్న వారింటికి వెళ్ళిపోయాను.

సన్మానం అతివైభవంగా జరిగిందట. మా తమ్ముడు వెళ్ళివచ్చి చెప్పాడు. ఒస్తూవొస్తూ, ఆయన ప్రతిభను ఉగ్గడించటానికిగాను వెలువడిన 'సోవెనీరు' వొక కాపీ పట్టుకొని వచ్చాడు. "నువ్వు రాలేదని చాలామంది అనుకున్నారు అక్కా" అన్నాడు. "ఒకరిద్దరు తమ ఉపన్యాసాలలోకూడా ఉదహరించారు" అన్నాడు

"ఏమన్నా రేమిటి?"

వాడు చాలాసేపు చెప్పలేదు. అడగ్గా అడగా, "సోక్రటీస్ అనే వొక ప్రముఖ తత్వవేత్త ఉండేవాడట; అతని భార్య మహాగయ్యాళి అట. ఎప్పుడూ భర్తను వేపుకు తింటూ ఉండేదట. అటువంటి భార్యలను టెస్ట్ కేసెస్ క్రింద మేధావులైన భర్తలకోసం భగవంతుడు సృష్టిస్తూ వుంటాడట అని, అనుకున్నారు" అన్నాడు.

మిగిలింది నేను ఊహించుకోగలను. నేను గయ్యాళి భార్యనా! ఆయన లోకానికి సేవ చేస్తూవుంటే నేను సహాయం చెయ్యకపోగా అసూయా ద్వేషాలతో వేధిస్తూవుంటాను! ఆయన కాబట్టి ఎంతో ఓర్పుతో ఇంటిగుట్టు రచ్చకు కాకుండా నన్ను సాకుకు వస్తున్నారు! ఏమి అన్యాయం!

ఏమీతోచక తమ్ముడు తెచ్చిన 'సోవెనీర్' తిరగేస్తూ కూర్చున్నాను. మంత్రులు, జడ్జిలు, ప్రముఖ రచయితలు ఎంతోమంది స్త్రీలపట్ల మావారు చేసిన సేవను ప్రశంసిస్తూ అందులో వ్యాసాలు వ్రాశారు. నేను యేం చెప్పను? నేను ఏం చెప్పితే ఎవ్వరు వింటారు? వీరంతా తెలిసి వ్రాశారా? తెలియక వ్రాశారా? తెలియక వ్రాశారు అనుకోటానికి కారణం కనిపించదు అంతా మోసం. సంఘానిది విలువెల్లా మోసమే! పుస్తకం మూసి ఆలోచించాను. ఎక్కడికి వెళ్తూవుందీ సంఘం?